# ఖుదీరాం బోస్

రచన:
శ్రీ ఆర్. వామనమూర్తి.

పుచ్చపువ్వులా వెన్నెల కాస్తోంది. వాకిట్లో వాలుకుర్చీలో కూర్చుని నశ్యం పీలుస్తున్న తాతయ్యచుట్టూ లక్ష్మి, రమేష్, బాబ్జి, జనని, చంటి వచ్చి కూర్చున్నారు. నశ్యం పీల్చడం పూర్తికాగానే ఏంరా అంతా వచ్చినట్లేనా అని అడిగాడు తాతయ్య.

ఆ! అంతా వచ్చినట్లే తాతయ్యా. యిక నీవు కథ మొదలుపెట్టడమే తరువాయి అన్నాడు చంటి. తాతయ్యా, తాతయ్యా నీ గదిలో ఫోటో వుంది చూడు. దానిమీద వందేమాతరం, వందేమాతరం అంటూ చక్కగా వ్రాసివుంది. ఉదయం లేవగానే నీవు ఆ ఫోటో వంకచూసి కళ్ళనీళ్ళుకూడా పెట్టుకుంటూయుంటావు. ఆ ఫోటోలో ఉన్నది ఎవరు తాతయ్యా అంటూ సందేహాన్ని వెలిబుచ్చాడు బాబ్జి. అదిరా! అది ఓపెద్ద సంఘటన అంటూ పైమీద తువ్వాలుతో కళ్ళు ఒత్తుకో సాగాడు తాతయ్య. అదేమిటి తాతయ్యా అన్నారు పిల్లలు. అదేరా! అది ఎనభై సంవత్సరాలక్రితం జరిగిన సంగతి. అంటే నా చిన్నతనంలో అన్నమాట, అప్పుడు మనం తెల్లవారిచేతుల్లో మ్రగ్గుతున్న రోజులు. ఆ కసాయివారి విచ్చుకత్తులలో ఎందరెందరో స్త్రీలు, పురుషులు, బాలురు బలియైపోయారు. వారి అరాచకత్వానికి ప్రజ సహించలేక పోయింది. మూకుమ్మడిగా అలజడులు లేవదీసారు. వందేమాతరం ఉద్యమాన్ని వాడవాడలా ప్రచారంచేయ సాగారు. వందేమాతరం ఉద్యమాన్ని నడుపుతున్న విప్లవ వీరులను ఉరికంబాలకు ఎక్కించడంవంటి ఘోర శిక్షలు తెల్లవారు చేయసాగారు. దీనికి ఎందరో దేశ భక్తులు బలి గావింపబడ్డారు. అట్టివారిలో ఖుదీరాం బోస్ ఒకరు.

ఆ రోజులలో కలకత్తా మేజిస్ట్రేట్ కింగ్స్ ఫర్డు విప్లవ వీరులకు కఠిన శిక్షలు వేయడంలో మంచి పేరు పొందాడు. ఆయన కలం ఎందరి దేశ భక్తులనో ఉరికంబాలకు ఎక్కించింది, మరి కొందర్ని ద్వీపాంతర శిక్షలకు పంపించింది. అటువంటి కిరాతక మేజిస్ట్రేటును యమపురికి పంపాలని విప్లవ వీరులంతా ఆలోచించారు. ఈవార్త, ఈనోట ఆనోట ప్రభుత్వం వరకు వెళ్ళింది. వెంటనే ప్రభుత్వం కింగ్స్‌ఫర్డ్‌కు గట్టి రక్షణ ఏర్పాడుచేసింది. ఆయనను చంపడానికి విప్లవ వీరులు చేసిన ప్రయత్నాలన్నీ చాలసార్లు విఫలమయ్యాయి. విప్లవ వీరులు మరోపథకంవేసారు. ఆయనను తుదిముట్టించే బాధ్యత యువ కిశోరాలైన ఖుదీరాం బోస్, ప్రఫుల్ల చాకీలకు అప్పగించారు.

ఖుదీరాం బోస్ 1889 డిశంబరు 3న బెంగాల్లోని మేదినీపూర్ జిల్లాలో పుట్టాడు. తండ్రి త్రైలోక్యనాథ్, ఆయన ఆ దంపతులకు ఏకైక పుత్రుడు, ఆరవ ఏటనే తల్లితండ్రులను పోగొట్టుకున్న దురదృష్టుడు, అక్కగారగు శ్రీమతి అనురూపాదేవి తమ్ముణ్ని పెంచి, చదివించ సాగింది. పాఠశాలలో చదివే రోజులలోనే విప్లవకారులతో పరిచయం ఏర్పడింది. అతనిలోని దేశ భక్తిని కార్య దీక్షనుచూసి విప్లవ నాయకులు తమ బృం

ధంలో కలుపుకున్నారు. దానితో ఖుదీరాంకు దేశ సేవ చేయడానికి మరింత అవకాశం కలిగింది. భారతమాతను సర్వ స్వతంత్రురాలిగా చేసి తీరుతానని ప్రతిజ్ఞ పలికాడు. బంకిం చంద్రుని 'ఆనందమఠం' గ్రంధాన్ని నిత్య పారాయణ చేయసాగాడు. నిదురలోకూడా వందేమాతరం, వందేమాతరం అంటూ కలవరించ సాగాడు.

ఒక రోజున మేధినీపూరులో జరిగిన బహిరంగ సభలో ఖుదీరాం నిర్భయంగా వందేమాతరం కరపత్రాలను పంచసాగాడు. వందేమాతరం పేరు వినగానే చిందులు త్రొక్కే తెల్లవారికి వందేమాతరం కర పత్రాలును నిర్భయంగా సభలో పంచుచుండేసరికి ఎక్కడలేని కోపంవచ్చేసింది. వెంటనే పోలీసు కుదీరాం చేతిలోయున్న కరపత్రాలను లాక్కొని పోలీసు స్టేషనుకు తీసుకువెళ్ళసాగాడు. వెంటనే ఆ పోలీసును ఓ దెబ్బకొట్టి అతని చేతులనుండి విడిపించుకొన్నాడు కుదీరాం. ముక్కుమీద మరోదెబ్బకొట్టి గుంపులోకి పారిపోయాడు కుదీరాం.

చీటికిమాటికీ విప్లవవీరులు తనపై హత్యాచారం జరపదలచడంవల్ల కలకత్తానుండి కింగ్స్ ఫర్డ్ బీహారు రాష్ట్రంలోని ముజఫర్ నగరంకు బదలీ చేయించుకున్నాడు. అతను విప్లవ వీరులపై అక్రమముగా విధించే శిక్షలకు ప్రాయశ్చిత్తంగా ఎక్కడవున్నా అతనికి మరణ శిక్ష వేయవలసిందేనని విప్లవవీరులు నిశ్చయించారు. అతను అంతమయేవరకు నిదురపోమని శపథం చేసారుకూడాను. వీర కిశోరాలైన కుదీరాం ప్రపుల్ల, చాకీలు, ఉద్యోగం కోసమనే వంకతో ముజఫర్ నగర్‌కు చేరుకుని సత్రంలో బసచేసారు. పైకిమాత్రం ఉద్యోగాన్వేషణయంటు కింగ్స్‌ఫర్డ్ ఉండే బసను, అతను వచ్చే పోయే మార్గమును, సమయమును బండి రంగును అంతా సేకరించారు.

వివరాల సేకరణ పూర్తి అవగానే 1908 ఏప్రిల్ 30 తేదీ రాత్రి వేళలో కింగ్స్‌ఫర్డ్ బండికోసం, మార్గ మధ్యంలోయున్న చెట్ల చాటున దాక్కొన్నారు. కొంతసేపు అవగానే కింగ్సుఫర్డు బండివంటి రంగులబండి రాసాగింది. అది వేచియున్న యువకుల కంటబడింది. వెంటనే బాంబులు చేతుల్లో సిద్ధంగా ఉంచుకున్నారు. కుదీరాం తన అనుచరుని హెచ్చరించ సాగాడు. అది కింగ్సుఫర్డు బండిలాగే వుంది, నేను బాంబువిసురుతాను నీవు పారిపో, నాగురించిమాత్రం చూడకు బ్రతియుంటే ఏ నాటికైనా కలుస్తాను అంటూ వందేమాతరం మంత్రాన్ని ఉచ్ఛరించి బాంబు విసిరి పారిపోయాడు. బాంబు పేలిన శబ్ధం వినిపించింది. కాని కింగ్సుఫర్డుకు బదులుగా ఆయన యింటికి వచ్చిన అథితులు మిసెస్ కెనడీ, ఆమె కుమార్తెయున్నారు. కుమారి కెనడి అక్కడికక్కడే చనిపోయింది;మిసెస్ కెనడీ మర్నాడు ఆసుపత్రిలో చనిపోయింది.

అలా కుదీరాం 25 మైళ్ళ దూరం నడచి వెళ్ళిపోయాడు. ఆయనకు కింగ్సుఫర్డు కాక ఆయన యింటికి వచ్చిన అథితులు చనిపోయారని తెలియగానే చాలా బాధపడ్డాడు. అప్పుడే నిందుతులకోసం ప్రభుత్వం గాలించ సాగింది. నిందితుల్ని పట్టియిచ్చినవార్కి బహుమతి కూడా యిస్తానని ప్రభుత్వం ప్రకటించింది.

ఎల్లప్పుడూ...




REGD. NO. 300188

''ఎమరాల్డ్'' బనియన్లనే వుపయోగించండి.

రాత్రింబవళ్ళు నడచిపోవడంవల్ల కుదీరాం అలసిపోయాడు. బట్టలు మాసిపోయాయి. ప్రభుత్వం ప్రకటించిన బహుమతికి ఆశించి కొందరు యువకులు నిర్దోషులకోసం వెతకడం ప్రారంభించారు. కొందరు కుదీరాం వేషంచూసి అతనిని అనుమానించి వెంటపడ్డారు. తనదగ్గర పిస్టలు ఉన్నప్పటికి ఎవరిపై దానిని ఉపయోగించలేదు. ఎవరినైతే దాస్య విముక్తులను చేద్దామని బద్ధకంకణంకట్టుకొని తెల్లవారిపై తిరుగుబాటు చేస్తున్న సాటి సోదరులకే వెన్నుపోటు పొడిచే ప్రజలను చూసి ఒకసారి హేయ్యపడ్డాడు. వారి స్వార్థబుద్ధీ కుదీరాంనుపట్టి పోలీసులకు అప్పగించింది.

ప్రఫుల్లకూడా రెండు రోజులు ఎవరికి చిక్కకుండా ప్రయాణం సాగించాడు. తరువాత ఒకసారి రైల్లో ఒక పోలీసు ఇనస్పెక్టరు అతన్ని పట్టుకోవడానికి ప్రయత్నించాడు. రెండుమూడు సార్లు ఆ పోలీసు ఇనస్పెక్టరుపై రివాల్వరు గుళ్ళు పేల్చాడు. కాని వారి బలగం ఎక్కువ అగుటవల్ల లాభం లేదనుకొని వెంటనే తన వైపు రివాల్వరు త్రిప్పుకుని కాల్చుకొని చనిపోయాడు. బహుమతికోసం ఆశపడ్డ పోలీసు పని నిరాశ అయింది. న్యాయమూర్తి చివరిసారిగా నీ కోరిక ఏమిటని అడిగాడు. నేను బాంబులను చేయడం నావారందరికి నేర్పుతానని అనేసరికి న్యాయమూర్తి నిశ్చేష్టుడైపోయాడు. 1908 ఆగస్టు 11 ఉదయం 6 గం॥ వందేమాతరం అంటూ ఉరికంబ మెక్కాడు విప్లవ కిశోరు కుదీరాం అంటూ కన్నులు ఒత్తుకున్నాడు. తాతయ్య కళ్ళు వత్తుకునేసరికి పిల్లలందరికి ఒక్కసారి కళ్ళవెంట నీళ్ళు వచ్చాయి. అంత నిర్దాక్షిణ్యానికి పాల్పడ్డారన్నమాట ఆ తెల్లవారు. మేంకూడా మీతోపాటు అటువంటి వీరపుత్రుణ్ని రోజూ తలుస్తూవుంటాం తాతయ్యా అంటూ ఒక్కరొక్కరే నిద్రాదేవి ఒడిలోకి జారుకున్నారు.

★

మనుమడు:_తాతా! ఆవు చాలా మంచిది కదూ?

తాత:_చాలా మంచిది. అందుకే దానిని ''గోమాత'' అని పెద్దలు అన్నారు.

★

